## క్లుప్తంగా

### భక్తి శ్రద్ధలతో వారాహి నవరాత్రి పూజలు


ప్రత్యేక అలంకారంలో వారాహి అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం లలితా సుందరేశ్వర స్వామి దేవాలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని బుధవారం వారాహి నవరాత్రి మహోత్సవ పూజలు నిర్వహించారు. గణపతి పూజ, గోపూజ, సర్వదేవతా పూజ, వారాహి అమ్మవారి పూజ, దర్బార్ సేవ, ఊంజల్ సేవ, తదితర కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. శ్రీ లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

### ‘హలో కేఎంసీ’కి విశేష స్పందన

కర్నూలు (టౌన్): నగరపాలక వినూత్నంగా ప్రవేశ పెట్టిన హలో కేఎంసీ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు నగరపాలక మేనేజర్ చిన్న రాముడు అన్నారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సోమవారం నుంచి ఇప్పటి వరకు మూడు రోజుల్లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 180 కి పైగ ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. వాటన్నింటిని రిజిస్టర్ చేసుకొని సంబందిత విభాగాలకు పంపించడం జరిగిందన్నారు. హెల్ప్ లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారించాలని ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

### ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలి


జిల్లా జైలును పరిశీలిస్తున్న ఎంపీ

కర్నూలు (టౌన్): జైలు నిబంధనలకు అనుగుణంగా ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం ఎంపీ జిల్లా జైలును సందర్శించారు. వివిధ కేసుల్లో శిక్ష పడిన ఖైదీలతో మాట్లాడి భోజనం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఖైదీల్లో మార్పు వచ్చే విధంగా జైలు వాతావరణం ఉండాలన్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన పెంచేందుకు జైలు అధికారులు కృషి చేయాలన్నారు. జైలు సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, జైలర్ నాయుడు, డిప్యూటీ జైలర్ నాగరాజు పాల్గొన్నారు.

### ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు కల్చరల్: దేవుని మాన్యం భూమి ఆక్రమణలను తొలగించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ రెవెన్యూ అధికారులను విన్నవించారు. దిన్నె దేవరపాడు చెన్నకేశవ, ఆంజనేయ స్వామి దేవాలయాల మాన్యం భూమి దిన్నెదేవరపాడు గ్రామం సర్వే నెం. 23/2లోని సుమారు 37 ఎకరాల ఉందన్నారు. కొందరు వ్యాపార దృక్పథంతో ఆ భూమిని ఆక్రమించుకున్నట్లు తెలియడంతో బుధవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. కర్నూలు తహసీల్దార్, సర్వేయర్, వీఆర్‌ఓలను కలిసి ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని కోరినట్లు వెల్లడించారు.

### ‘మత్తు’ రవాణాను అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా జరుగుతున్న డ్రగ్స్, గంజాయిల రవాణాను అరికట్టాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..మత్తుపదార్థాల వినియోగంతో యువత పెడదోవ పడుతోందన్నారు. కొందరు స్వార్థం కోసం మత్తు పదార్థాలను రవాణా చేస్తూ సొమ్ము చేసుకోవడం అన్యాయమన్నారు. అలాంటి వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. బీసన్న, పెద్దయ్య, రాజీవ్, శేషన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### భవిత కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలి

పాణ్యం: భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర భవిత కేంద్రాల పరిశీలకుడు దండేపాల్ అన్నారు. బుధవారం పాణ్యంలోని భవిత కేంద్రంలో ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉన్నత విద్య అభ్యసించేలా వారిని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి


గాయపడిన శ్రీరాముల దేవరత్నం

అవుకు: మండల పరిధిలోని చునుగొండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీరాముల దేవరత్నం, అతని కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. దీనిని జీర్ణించుకోలేని అ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలోని వారి ఇళ్లపైకి వెళ్లి దాడులు చేశారు. ఘటనలో దేవరత్నానికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తి శ్రీరాముల శేఖర్‌కి మూగదెబ్బలు తగిలాయి.

# ఫోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనత నివారణ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శరీరంలో రక్తహీనత సమస్యను ఫోలిక్ యాసిడ్ మాత్రలు తగ్గిస్తాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన ఈ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సందర్శించి ఫోలిక్ యాసిడ్ మాత్రల ఉపయోగం గురించి విద్యార్థులకు వివరించాలని సిబ్బందికి చెప్పారు. ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి పీరియడ్స్ సమయంలో అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. గర్భధారణ సమయంలో ఫోలిక్ ఆమ్లము లేకపోవడం వల్ల జన్మించే పిల్లల్లో లోపాలు రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, పాలు, పండ్లు తినడం ద్వారా రక్తహీనత రాకుండా నివారించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త హేమలత మాట్లాడుతూ సున్నా నుంచి 18 ఏళ్ల వయస్సు గల విద్యార్థుల్లో వచ్చే వ్యాధులు, లోపాలను ఈ శిక్షణ కార్యక్రమంలో వివరించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి లోపాల ఉంటే వారిని వైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లి సత్వర చికిత్స అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

**అవసరమైన అందరికీ వైద్యపరీక్షలు చేయించాలి**

అవసరమైన వారందరికీ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించి చికిత్స అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం నగర శివారులోని ప్రజానగర్‌లోని సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక రోజు ముందుగానే ఆరోగ్యసేవలు అవసరమైన వారికి సమాచారం అందించాలన్నారు. గర్భిణీలకు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, అందులో రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్సలు ఇవ్వాలని చెప్పారు. అనంతరం అక్కడే జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి గర్భిణీలు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాఘవులు, డీపీఎం ప్రసాద్, ఆరోగ్యపర్యవేక్షకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఏపీ హంస నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్

కర్నూలు (హాస్పిటల్) : ఏపీ హంస అసోసియేషన్ కర్నూలు సిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సహకారం వల్లే కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా టి.గోవిందు, కార్యదర్శిగా చక్రధర్, ట్రెజరర్‌గా శివుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటస్వామి, జాయింట్ సెక్రటరీగా లిల్లీ, ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సంపత్, ప్రసూన, సునీత, ప్రభాకర్‌రెడ్డి, వీణా కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణుగోపాల్, ఉమెన్ వింగ్ సెక్రటరీగా సరస్వతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీ హంస రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### శాశ్వత లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం

కర్నూలు (లీగల్) : ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసులు ఉంటే శాశ్వత లోక్ అదాలత్ ద్వారా సత్వరం పరిష్కరించుకోవచ్చని ఆ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకటహరినాథ్ అన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా లేదా తీర్పు ద్వారా పరిష్కారమైన కేసుపై అప్పీలు లేదన్నారు. బుధవారం సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించబడిన కేసు వివరాలను ఆయన వెల్లడించారు.

### 15న నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఈనెల 15 వ తేదీ నగర పాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో 11 అంశాలకు సంబంధించిన అజెండాపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గత ఫిబ్రవరి నెల 17 న చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

# ఐదేళ్ల పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్చకుండా చూడాలి


వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ప్రైవేటు కాన్వెంట్లలో చేరనీయకుండా నిలుపుదల చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం వారు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల, యూనియన్ అధ్యక్షురాలు రేణుకమ్మ, నగర నాయకురాలు బాలదుర్గమ్మ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు కాన్వెంట్ల సంఖ్య పెరిగిపోతోందని, గ్రామాలు, పట్టణాల్లో ఈ కాన్వెంట్లలో మూడు సంవత్సరాల లోపు పిల్లలను కూడా చేర్పిస్తున్నారన్నారు. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాన్వెంట్లలో చేర్చడంతో పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారని చెప్పారు. వినతి పత్రం అందించిన వారిలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నగర నాయకులు మహమ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

### 13న జల్సా యే యాదే హుస్సేన్ రజి

కర్నూలు(అర్బన్): నగరంలోని కొత్తపేట మజ్జిద్-ఏ-అల్మాస్‌లో ఈ నెల 13వ తేదీన ఇషా నమాజ్ నుంచి జల్సా యే యాదే హుస్సేన్ రజి నిర్వహించనున్నట్లు అహిలె సున్నాతుల్ జమాత్, జిల్లా మైనారిటీ నాయకులు షేక్ నజీర్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉపన్యాసకులుగా హైదరాబాద్ నుంచి మౌలానా డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రీ సాహెబ్, మౌలానా సయ్యద్ వాహిద్ అలీ ఖాద్రీ సాహెబ్, నాయబ్ ముఫ్తీ జామియా నిజామియా హాజరవుతున్నట్లు తెలిపారు.

# స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్వహణలో స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట డిమాండ్ డేను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..మధ్యాహ్న భోజనం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమల్లోకి తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక నష్టదాయక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. హమాలీల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికుడు ప్రమాదంలో చనిపోతే ఆ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అసోసియేషన్ నాయకులు యాకోబు, నాయకులు సాయిబాబా, రాధిక, రాముడు,రాజశేఖర్ పాల్గొన్నారు.

### మహారాష్ట్ర గవర్నర్‌తో శ్రీమఠం పీఠాధిపతి భేటీ

మంత్రాలయం: శ్రీకృష్ణ చరిత్ర మంజరి పుస్తకావిష్కరణలో భాగంగా మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్‌తో మంత్రాలయం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భేటీ అయ్యారు. బుధవారం ముంబాయి నగరంలో రాజ్‌భవన్‌కు చేరుకుని ఆ రాష్ట్ర గవర్నర్‌తో కలిసి పుస్తకావిష్కరణ గావించారు. రాఘవేంద్ర స్వామి రచించిన శ్రీకృష్ణ చరిత్ర మంజరి గ్రంథానికి శ్రీమఠం పండిత కేసరి గిరి ఆచార్య సంకలనం గావించారు. సంకలనం పుస్తకాన్ని పూణేకు చెందిన గురు రాజ్ పులకర్ణి మరాఠి భాషలో అనువాదం చేశారు. సదరు పుస్తకాన్ని పీఠాధిపతి గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించారు.

# రూ.15.44 లక్షల విత్తనాలు, పురుగు మందులు సీజ్

నంద్యాల(అర్బన్): పట్టణంలోని సాయి ఆగ్రో ఏజెన్సీస్, దుర్గా భవానీ ఫర్టిలైజర్స్, రాయల్ ఆగ్రో ఏజెన్సీస్, గణపతి సీడ్స్, అన్నదాత సీడ్స్, రైతు మిత్ర ఆగ్రో ఏజెన్సీస్, కిరణ్ హైబ్రీడ్స్, ధరణి సీడ్స్, జయ సాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రావణ లక్ష్మీసీడ్స్ దుకాణాల్లో శనివారం వ్యవసాయ , విజిలెన్స్‌శాఖల అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. డీడీఏ సుబ్రమణ్యేశ్వరస్వామి, శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారులు సునీల్‌కుమార్, సిద్ధయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో సరైన ధ్రువపత్రాలు లేనందున రూ.15.44 లక్షల విలువ చేసే విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే ఏజెన్సీలు విక్రయించాలని, ప్రాసెసింగ్ యజమానులు ప్లాంట్, డిస్పాచ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు

కోడుమూరు రూరల్: డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ప్యాలకుర్తిలోని జగనన్న కాలనీని బుధవారం ఆయన పరిశీలించారు.

# చిరుత కదలికలపై నిఘా తీవ్రతరం

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు
- గోశాల, పరిసరాల్లో రెండు సీసీ కెమెరా ట్రాప్‌లు
- నల్లమలలో పరిశీలించిన ప్రత్యేక బృందం


గోశాల సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ట్రాప్


పాదముద్రలు గుర్తింపు


గోశాల వద్ద కనిపించిన చిరుత (సీసీ కెమెరా దృశ్యం)

మహానంది: మహానంది ఆలయ పరిసరాలతోపాటు ఈశ్వర్‌నగర్, పార్వతీపురం కాలనీ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత కదలికలు, జాడ కోసం అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. మహానందిలోని ఆలయం వెనుక వైపు ఉన్న గోశాల వద్ద అత్యాధునికమైన రెండు సీసీ కెమెరా ట్రాప్‌లు(ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్) ఏర్పాటు చేశారు. దీని ద్వారా చిరుత కదలికలు తెలుస్తాయని ఓ అధికారి తెలిపారు. గోశాల సమీపంలోని నల్లమలలో ఉన్న సిమ్ప్‌లైన్(ఫైర్‌లైన్) ప్రాంతం నుంచి నిత్యం చిరుత వస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈశ్వర్‌నగర్‌కు చెందిన నాగన్నపై దాడి చేసిన ఘటనపై విచారణ చేయగా ఆ ప్రాంతంలో పందుల సమూహం ఉందని, పందుల కోసం చిరుత వచ్చి ఉంటుందని తెలిపారు. గతంలో అటవీశాఖ ఉన్నతాధికారులు ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో సుమారు 70 పెద్దపులులు, రెండు వందలకు పైగా చిరుతలు ఉన్నాయని గత ఏడాది నవంబర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా పచ్చర్ల, మహానంది, బుక్కాపురం, తిమ్మాపురం పరిసర ప్రాంతాల్లో చిరుతల సంచారంతో ప్రజలు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

**ఎన్ఎస్‌టీఆర్ అధికారుల అనుమతి కోసం ఎదురుచూపులు**

మహానందిలో ఓ యువకుడిని గాయపరిచిన చిరుతను బంధించేందుకు తమకు ఎలాంటి అధికారం లేదని, అటవీశాఖ ఉన్నతాధికారులు, ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్‌డైరెక్టర్, ఇతర అధికారుల ఆదేశాలతోనే బంధించాలని ఓ అటవీశాఖ అధికారి తెలిపారు. కాగా తిరుపతి జూకు తరలించకుండా సుదూర ప్రాంతాల్లో వదిలిపెట్టేందుకైనా ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వాలని పరిసర ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కొచ్చెర్వు పొలాల్లోకి చిరుత?

మహానంది: మహానంది మండలం బుక్కాపురం గ్రామ పొలిమేర పరిధిలోని కొచ్చెర్వు, బరగొడ్ల బ్రిడ్జి సమీపంలోని పొలాల్లో బుధవారం సాయంత్రం పులి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. సాయిబాబా పొలం నుంచి చలమయ్య పొలం వరకు ఉన్న అరటితోటల్లో పులి సంచరిస్తుందని స్థానికులు వాపోతున్నారు. అయితే అది పెద్దపులినా లేక చిరుతపులినా అన్నది నిర్ధారణ కావాల్సి ఉంది. ఇదిలా ఉండగా పొలంలో అక్కడక్కడా పాదముద్రలు ఉన్నాయని స్థానిక రైతులు చెప్పారు. అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పులినా, చిరుతా, లేక వన్యప్రాణులా అన్నది నిర్ధారించాల్సి ఉంది.

# పెద్దాసుపత్రిలో యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ పనులు

- ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశం


ఆసుపత్రిలో అధికారులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజి మరమ్మతుల పనులు చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆర్థో ఓటీ విభాగంలో అల్యూమినియం డోర్స్ మరమ్మతులు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సర్జికల్ వార్డులో డ్రైనేజీ సమస్యల గురించి ఆరా తీశారు. ఇక్కడ టైల్స్, లైట్ల మరమ్మతులు పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. డైట్ విభాగంలో ఎంత మంది రోగులకు, డాక్టర్లకు భోజనాలు ఇస్తున్నారని ఆరా తీశారు. రోగులకు రుచికర భోజనం అందించాలని, డైట్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో ఎలక్ట్రికల్ లైట్లు, ఫ్యాన్లు మరమ్మతులు ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని నర్సింగ్ సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ నర్సింగ్ సూపరింటెండెంట్ రౌండ్స్ నిర్వహించి ఆయా విభాగాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే దానిని పరిష్కరిస్తానని తెలిపారు. ఆసుపత్రిలో 150 ట్యూబ్ లైట్లను వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని ఏడీ రమేష్‌బాబును ఆదేశించారు. జీవనధార మెడికల్‌షాపులు తనిఖీలు చేసి, అక్కడ ఏఏ మందులు విక్రయిస్తున్నారని ఆరా తీశారు. ఈ షాపులను ఫార్మసి మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్ ఉన్నారు.

# రోడ్లపై వ్యాపారాలు చేస్తే పిటీ కేసులు

- ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరిక
- నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్


చెన్నమ్మ సర్కిల్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు (టౌన్) : ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ రోడ్లపై వ్యాపారాలు చేస్తున్న వారిపై పిటీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని కర్నూలు ట్రాఫిక్ సీఐ పి.గౌతమి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. స్థానిక చెన్నమ్మ సర్కిల్‌లో రోడ్ల మీద పండ్ల బండ్లు, టిఫిన్ బండ్లు, బజ్జీల బండ్లు, మొబైల్ క్యాంటీన్లు పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందడంతో ఆ ప్రాంతంలో సీఐ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొబైల్ క్యాంటీన్లు, టిఫిన్ బండ్లను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

**ప్రతి ఆటోకు టాప్ నెంబర్**

నగరంలో ప్రతి ఆటో టాప్‌కు నంబర్‌తో పాటు ఆటోకు సంబంధించిన పూర్తి రికార్డుల వివరాలు ఉండాలని కర్నూలు ట్రాఫిక్ సీఐ గౌతమి స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన సీఐ ప్యాసింజర్ ఆటోడ్రైవర్లు, ఓనర్లకు ఆటో టాప్ నంబర్లపై అవగాహన కల్పించారు. అలాగే నగరంలో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రచారం చేపట్టారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ రికార్డులను తప్పనిసరిగా కలిగా ఉండాలని సీఐ సూచించారు. ఈనెల 15వతేదీ లోపు ప్రతి ఆటోడ్రైవర్, ఓనర్ సరైన రికార్డులను చూపించి ఆటో టాప్ నంబర్లను తీసుకోవాలన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కల్లూరు: పందిపాడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. బుధవారం మాధవీ నగర్‌లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఇందిరమ్మ కాలనీ వాసులు కలిసి సమస్యలపై వినతి పత్రమిచ్చారు. 2009 సంవత్సరంలో 2500 మంది పేదలకు నాటి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చిందన్నారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా సరైన మౌలిక సదుపాయాలు లేవన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాము, నాగరాజు, గోకారి, అన్వర్ బాష, కాశమ్మ, నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ పరిధిలోని 524 కాలనీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిశారు. కొంతమంది వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టించి తమకు ఇంటి పన్నులు, కుళాయిలు మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి



డీఈఓ ఆఫీస్ ఏడీ శ్యామూల్ పాల్‌కు వినతి పత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుల

కర్నూలు సిటీ: విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా ప్రభుత్వ పాఠశాలల చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదని, వెంటనే అందించాలని డీఈఓ ఆఫీస్ ఏడీ శ్యామూల్ పాల్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7వ తరగతి విద్యార్థులకు ఇంత వరకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పుస్తకాలు అందలేదని, 6వ తరగతి వారికి సైన్స్, ఫిజిక్స్, సోషల్ పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అదే విధంగా పాఠశాలల నిర్వహణకు నిధులు లేకపోవడంతో చాక్‌పీస్‌లు కూడా కొనుగోలు చేయలేదన్నారు. అలాగే పాఠశాలల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

# ఘనంగా పీఠాధిపతి జన్మదినం




పీఠాధిపతికి పట్టణ ప్రవేశ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, హారతి పడుతున్న భక్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అహోబిల మఠం పీఠాధిపతి రంగరాజ యతీంద్ర మహాదేశికన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా అహోబిల మఠంలో స్వామీజీ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హారతులు పట్టారు. అనంతరం ఆడపడచులు నారీకృత నీరాజనం పలికారు. ఈ సందర్భంగా వివిధ పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీలో స్వామీజీని కొలువుంచి ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో మాడవీధుల్లో పట్టణ ప్రవేశ ఉత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామీజీ జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపి స్వామి ఆశీర్వాదం పొందేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన అనేక మంది హాజరయ్యారు. వేడుకలు ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

### 15 నుంచి రామాలయ శతాబ్ది ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక వన్‌టౌన్ మెయిన్ బజార్‌లోని పేట శ్రీరాముల వారి దేవాలయం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 15వ తేదీ ఆషాడ శుక్ల నవమి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఊంజల్ సేవ, భక్తి సంగీత విభావరి, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.